TELTEL/2023/87917

# జనం వెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

అనునిత్యం అక్షరసత్యం

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 06 ఆదివారం 23 - 03 - 2025 ఎడిటర్ : సీతార్ల సురేష్ పేజీలు : 8 వెల : 6/-

## తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కొరకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి



**జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య**

**జనం వెలుగు, హైదరాబాద్:-** తెలంగాణ బీసీ బిల్లుకు అఖిలపక్ష మద్దతు కోసం భవిష్యత్ కార్యాచరణ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేసే బాధ్యత మీది ఉద్యమించే బాధ్యత మాది, గుజ్జ సత్యం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని చేసిన తీర్మానం పార్లమెంటులో ఆమోదం పొందేలా భవిష్యత్ కార్యాచరణ కోసం కాచిగూడ లోని అభినందన్ గ్రాండ్ లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన మీడియా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంతు, మరియు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సింగిల్‌గానే మళ్లీ అధికారంలోకి వస్తాం : స్పష్టం చేసిన కేసీఆర్



**జనం వెలుగు, హైదరాబాద్ మార్చి 22:-** రాబోయే రోజుల్లో అధికారం మళ్లీ బీఆర్ఎస్‌దే అని పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తేల్చిచెప్పారు. రాష్ట్రంలో సింగిల్‌గానే మళ్లీ అధికారంలోకి వస్తామని స్పష్టం చేశారు కేసీఆర్. 'గోదావరి కన్నీటి గోస' పేరుతో గోదావరి నది నుంచి కొండపోచమ్మసాగర్ వరకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాదయాత్ర నిర్వహించి.. ఇవాళ మధ్యాహ్నం ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో కోరుకంటి చందర్ పాదయాత్ర బృందంతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.బెల్లం ఉన్న దగ్గరకే ఈగలు వస్తాయి. తెలంగాణను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారు. పదేళ్లు తెలంగాణలో ఎలాంటి ఇబ్బందులు లేవు. తెలంగాణ ఇప్పుడు సమస్యల వలయంలో చిక్కుకుంది. తెలంగాణ కోసం ఎప్పటికైనా పోరాడేది బీఆర్ఎస్ మాత్రమే. తెలంగాణ హక్కుల కోసం పోరాడాలి. అందరూ ఒక్కో కేసీఆర్‌లా తయారు కావాలి అని కేసీఆర్ పిలుపునిచ్చారు.కాంగ్రెస్ నోటికొచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. కానీ ఒక్క హామీ కూడా నెరవేర్చడం లేదు. మేనిఫెస్టోలో పెట్టనున్న రైతు బంధు, కల్యాణ లక్ష్మీ ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి అని కేసీఆర్ సూచించారు.ఏపీలో కూటమి లేకుంటే చంద్రబాబు గెలిచేవాడు కాదు. బలవంతంగా మనల్ని ఆంధ్రాలో కలిపారు. ఈ నేలపై ఎవరు శాశ్వతం కాదు. ఆనాడు మోడీ నా మెడపై కత్తి పెట్టిన తెలంగాణ కోసం నేను ఎక్కడ వెనకడుగు వేయలేదు. తెలంగాణ కోసం ఎప్పటికైనా పోరాడేది బీఆర్ఎస్ మాత్రమే. రామగుండంలో గెలిచిన ఎమ్మెల్యే ఓ సన్నాసి. తెలంగాణని ఆనాడు ఇందిరాగాంధీ మోసం చేసింది అని కేసీఆర్ ధ్వజమెత్తారు.

## కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేది రాష్ట్ర కమిటీనా? జాతీయ నాయకత్వమా?

### సొంత పార్టీ నేతలపై మరోసారి రాజాసింగ్ ఘాటు వ్యాఖ్యలు



**జనం వెలుగు, హైదరాబాద్ మార్చి 22:-** రాష్ట్రానికి త్వరలో కొత్త బిజెపి అధ్యక్షుడు వస్తాడని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేది రాష్ట్ర కమిటీనా? జాతీయ నాయకత్వమా? అని ప్రశ్నించారు. మరోసారి సొంత పార్టీ నేతలపై రాజాసింగ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కొత్త అధ్యక్షుడిని జాతీయ కమిటీ నిర్ణయిస్తే బాగుంటుందని.. రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే కొత్త అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్‌గానే ఉంటారని ఎద్దేవా చేశారు. గతంలో చేసిన అధ్యక్షుడు గ్రూప్ తయారు చేసి పార్టీకి నష్టం చేశారని.. కొత్త అధ్యక్షుడు కూడా అదే గ్రూప్ఇజం చేస్తే పార్టీకి మరింత నష్టమని ఆయన అన్నారు.ప్రస్తుతం మంచి నాయకుల చేతులు కట్టి పక్కన పడేశారని.. సీనియర్ నేతలకు స్వేచ్ఛ ఇస్తే తెలంగాణలో బిజెపి ప్రభుత్వం వస్తుందని పేర్కొన్నారు. కొత్త బిజెపి అధ్యక్షుడు సిఎంతో రహస్య భేటీలు నిర్వహించవద్దని అన్న ఆయన అది సీనియర్ నేతలు, కార్యకర్తల మనస్సులో మాట అని దాన్ని బయటపెడుతున్నట్లు తెలిపారు. పార్టీ నేతలకు చెప్పాలే గానీ, మీడియాకు చెప్పవద్దని కొందరు చెబుతున్నారని అన్నారు. పార్టీ పెద్దల దృష్టికి తెస్తే వినకపోతేనే ప్రజల ముందు పెడుతున్న అని తెలిపారు. బిజెపి సీనియర్ నాయకులను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఓయూ సర్క్యులర్ ను వ్యతిరేకించిన ఏబీవీపీ

**జనం వెలుగు, హైదరాబాద్:-** ఉస్మానియా యూనివర్సిటీ లో ఓయూ అధికారులు అప్రజాస్వామికంగా ఇచ్చిన సర్క్యులర్ ను ఏబీవీపీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు ఆర్ట్స్ కళాశాల అవరణలో పత్రిక సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2025 మార్చ్ 13 వ తేదీని ఉస్మానియా యూనివర్సిటీ లో బ్లాక్ డే గా ప్రకటిస్తున్నాం అని అన్నారు. వందేమాతరం ఉద్యమం నుండి తెలంగాణ ఉద్యమం వరకు రాష్ట్రంలో ఏ సమస్యా ఉన్న కానీ తీర్చి దిద్దే గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అని అన్నారు. వర్సిటీలో ధర్నాలు, నిరసనలు చేయొద్దు అంటూ అధికారులు ఇచ్చిన సర్క్యులర్ ను విడుదల చేయడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. ఇప్పటికే సర్క్యులర్ ఇచ్చి పది రోజులు అయినప్పటికి వర్సిటీ అధికారులు స్పందించకపోవడం గమనార్హం అని అన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు ఓయూ అధికారులు ఇచ్చిన సర్క్యులర్ కు వత్తాసు పలుకుతూ ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడ్డం సిగ్గుచేటు అన్నారు. ఈస్ట్ జోన్ డిసిపి బాలస్వామి ఓయూ లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉందని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మనమేమైనా ఛత్తీస్ ఘడ్ అడవులలో ఉన్నామా లేదా విశ్వవిద్యాలయంలో ఉన్నామా అని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ఓయూ అధికారులు స్పందించి సర్క్యులర్ ను వెనక్కి తీసుకోకపోతే రానున్న రోజుల్లో విసి బిల్డింగ్ ను అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## డీలిమిటేషన్‌ను మేం అంగీకరించం..?



**ద్వితీయ శ్రేణి పౌరులుగా మారే ప్రమాదం ఉంది: రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**జనం వెలుగు, హైదరాబాద్:-** డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా బలహీనపరుస్తోందని ఈ ప్రక్రియ జరగాలంటే దక్షిణాదికి లోక్‌సభలో 33 శాతం సీట్లు ఇవ్వాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం దేశం పెద్ద సవాల్‌ను ఎదుర్కొంటోంది, బీజేపీ జనాభా విధానాన్ని కొనసాగిస్తోంది. డీలిమిటేషన్ దక్షిణాది రాష్ట్రాల రాజకీయ కుదింపుగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం దక్షిణాది రాష్ట్రాల అభిప్రాయం తీసుకుని, నియోజకవర్గాల పునర్ విభజన చేపట్టాలి. దేశమంటే అన్ని రాష్ట్రాల కలయిక. నియోజకవర్గాల పెంపుపై మన అభిప్రాయాలను పంచుకోవాలి.. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలి. నా అభిప్రాయాలను మీతో పంచుకుంటున్నా డీలిమిటేషన్ పై మనందరిని ఏకతాటిపై తెచ్చిన తమిళనాడు సీఎం స్టాలిన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు రేవంత్ రెడ్డి. 1971లో జనాభాను నియంత్రించాలని దేశం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు దాన్ని అమలు చేస్తే ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విఫలమయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించాయి జీడీపీ, తలసరి ఆదాయం వేగంగా ఉద్యోగాల కల్పన మెరుగైన మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో మంచి ప్రగతి సాధించాయి.

## భరత మాత స్వేచ్ఛ కోసం ఉరి తాడుని ముద్దాడిన విప్లవ చైతన్య మూర్తులు

**-నేడు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల వర్ధంతి**

**-నేడు భారతమాత ముద్దుబిడ్డల బలిదాన దినోత్సవం**

భరత మాతను బానిసపు సంకెళ్ళు నుండి విముక్తి చేయడానికై, మనందరి సంతోషం.. స్వేచ్ఛ కోసం 23 యేళ్ళ వయ్యస్సులోనే అనన్యమైన పోరాటాలు చేసి యావత్ భారత జాతి కి స్పూర్తిని కలిగించడం కోసం.. భరత మాత స్వేచ్ఛ కోసం ఉరి తాడుని ముద్దాడి తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన భరత మాత ముద్దు బిడ్డల్లు, విప్లవ చైతన్య మూర్తులు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల వర్ధంతి మర్చి 23న. ఏ స్వార్థం లేకుండా, ఏ పదవులు, ప్రయోజనాలు ఆశించకుండా చిరు ప్రాయంలోనే భరత మాత స్వేచ్ఛ కోసం బలిదానం చేసిన ఆ ముగ్గురు యువ కిషోరాల త్యాగాలను మనం స్మరించికొని, వారి వర్ధంతి (23 మార్చి) రోజున వారికి మన హృదయపూర్వకంగా నివాళులు అర్పించడం ఈ దేశ పౌరులుగా మన కనీస బాధ్యత.. ఆ ముగ్గురునీ ఉరి తీసిన రోజు... భగత్ సింగ్ (సెప్టెంబరు 28, 1907 %-%మార్చి 23, 1931):- స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు.భారత స్వాతంత్ర్యోద్యమమునకు పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులలో ఆయన ఒకరు. ఈ కారణంగానే 'షహీద్ భగత్ సింగ్ గా కొనియాడబడతాడు'. సుఖ్ దేవ్ థాపర్ (15 మే 1907 - మార్చి 23, 1931):- భారత స్వాతంత్ర్య సమర, ఉద్యమకారుడు. ఇతను భగత్ సింగ్ మరియు రాజ్‌గురు ల సహచరునిగా ప్రసిద్ధి. హరి శివరాం రాజ్ గురు (ఆగష్టు 24, 1908 - మార్చి 23, 1931):- భారత స్వాతంత్ర ఉద్యమ, ఉద్యమకారుడు. మహారాష్ట్ర లోని ఒక బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడు. ఇతను భగత్ సింగ్ మరియు సుఖ్ దేవ్ ల సహచరునిగా ప్రసిద్ధి... 1928లో భారత్‌లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే కమిషన్ సభ్యుడిగా ఒక్క భారతీయుడిని కూడా నియమించకపోవడంతో భారత రాజకీయ పార్టీలు దానిని బహిష్కరించాయి. ఫలితంగా దేశవ్యాప్తంగా పలు నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి. 30 అక్టోబరు 1928న కమిషన్ లాహోర్‌ను సందర్శించినప్పుడు సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా లాలా లజ్‌పత్ రాయ్ నేతృత్వంలో నిశ్శబ్ద అహింసా పద్ధతిలో ఒక నిరసన కార్యక్రమం జరిగింది. అయితే హింస తలెత్తడానికి పోలీసులు కారణమయ్యారు.1 సెప్టెంబర్ 1928లో లాహోర్‌లో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్న 64 ఏళ్ల వృద్ధుడు లాలా లజపతిరాయ్‌పై సాండర్స్ అనే బ్రిటిష్ అధికారి పాశవికంగా లాఠీచార్జి చేసారు దాంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హతమార్చడానికి విప్లవకారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్ మరియు సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. స్కాట్‌ను గుర్తించిన జై పాల్ ఆయన్ను కాల్చమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. అయితే పొరపాటు గుర్తింపు కారణంగా డీఎస్పీ జేపీ సాండర్స్ కనిపించినప్పుడు సింగ్‌కు జై పాల్ సంకేతమిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. దాంతో పోలీసుల కంట పడకుండా ఉండటానికి భగత్ లాహోర్ పారిపోయాడు. గుర్తు పట్టకుండా ఉండటానికి గడ్డాన్ని గీసుకోవడం, వెంద్రుకలు కత్తిరించుకోవడం ద్వారా సిక్కు మత విశ్వాసాల ఉల్లంఘనకు సింగ్ పాల్పడ్డాడు. 1928 లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగతీర్చుకోవడానికి, ఫిరోజ్ పూర్ లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హతమార్చినందులకు గాను భారత స్వాతంత్ర్యోద్యమంలో కృషి చేసిన ఈ ముగ్గురు విప్లవకారులు (భగత్ సింగ్ , రాజ్ గురు, సుఖ్ దేవ్) లను 1931 మార్చి 23న లాహోరు సెంట్రల్ జైలులో సాయంకాలం 7.33 సమయానికి ఉరి తీశారు. అప్పటి నిబంధనల ప్రకారం ఆ సమయంలో ఉరి శిక్ష అమలు జరపడం జరిగేది కాదు. వారి మృత దేహాలను రహస్యంగా, జైలు వెనుక గోడలు పగులగొట్టి తీసికొని వెళ్ళిసట్లెజ్ నది తీరాన హుస్సేన్‌వాలా అనే ఊరిలో దహనం చేశారు. మృత దేహాను చూసిన ప్రజలలో అలజడిని ఎదుర్కోకుండా ఇలా చేశారు.దేశమాత వీరపుత్రులైన రాజ్ గురు ,సుఖ్ దేవ్,భగత సింగ్ లను స్మరిద్దాం... వారు చేసిన త్యాగాలను మనమంతా కీర్తిద్దాం ... అమర జీవులకిదే ఘన నివాళులు.. ఇన్ క్విలాబ్ జిందాబాద్.



# దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ వివక్ష కొత్త కాదు

**జనం వెలుగు, చెన్నై, మార్చి 22:–** కేంద్ర ప్రభుత్వం చేయనున్న డిలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రం నష్టం జరుగుతుంది. ఇప్పటికే కేంద్రం వివక్షపూరిత విధానాలతో మనం చాలా కోల్పోయాం. దేశ అభివృద్ధి కోసం మనం చర్యలు తీసుకుని పని చేసినందుకు ఈరోజు మనం ఇబ్బంది పడుతున్నామని' బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. చెన్నైలో జరిగిన విపక్షాల సమావేశానికి హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ప్రజల నుంచి అనేక అంశాలు స్ఫూర్తిగా తీసుకుని నడుస్తాం. అస్తిత్వం కోసం, హక్కుల కోసం కొట్లాడడంలో తమిళనాడు దేశానికి స్ఫూర్తినిచ్చింది. ద్రావిడ ఉద్యమం తమ హక్కులు సాధించుకోవడానికి దక్షిణాది రాష్ట్రాలకు ఒక దిక్సూచిలా పనిచేస్తుంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం. ప్రజాస్వామ్యం మందబలం ఆధారంగా నడవరాదు . మందబలం ఉంటే నియంతృత్వం రావద్దు. దేశ అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు ఈ డిలిమిటేషన్ విధానంతో నష్టం, దేశాన్ని వెనక్కి నడిపిస్తున్న ఉత్తరాది రాష్ట్రాలకి లాభం చేకూరుస్తుంది. జిడిపిలో దేశానికి 36% భాగస్వామ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు శిక్ష పడుతుంది. ఇది సరైన నిర్ణయం కాదు. కేంద్ర ప్రభుత్వ దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపడం కొత్తేమీ కాదు. కానీ డిలిమిటేషన్ అనేది కేవలం పార్లమెంట్ ప్రాతినిధ్యం తగ్గడానికి పరిమితం కాదు. నిధుల కేటాయింపుల్లోనూ నష్టం జరగబోతుంది. వీటి కేటాయింపుల్లో కూడా అధికారం పూర్తిగా కేంద్రీకృతమై నియంతృత్వం వైపు దారితీసే అవకాశం ఉన్నది. ఆర్థిక వనరుల కేంద్రీకృతం జరగడం వలన భవిష్యత్తులోనూ ప్రస్తుతం ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న నిధుల కేటాయింపులు అన్యాయం పెరుగుతుంది.

### బుల్లెట్ రైలు ఉత్తరాదికే పరిమితం

అన్ని రాష్ట్రాలకు సమన్యాయమని చెప్పే కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టులు ఉత్తరాది రాష్ట్రాలకే పరిమితం అయ్యాయి. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చర్యలు దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయం పైన పుండుపైన ఉప్పు రుద్దినట్టుగా ఉన్నాయి. ఓ ప్రాంతంపై మరో ప్రాంతం ఆదిపత్యం చలాయించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కేవలం జనాభా ఆధారంగా ఎంపీ సీట్లు పెంచితే దేశ సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలుగుతుంది. వెనుకబడిన రాష్ట్రాలకు నిధులు కేటాయించడాన్ని మేం వ్యతిరేకించలేదు. కేవలం నిధుల కేటాయింపుల వివక్షను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

### భారత్ సూపర్ కావాలంటే..



1971 తర్వాత ఉన్న పార్లమెంటు సీట్లు కేటాయింపు తర్వాత జరిగిన జనాభా నియంత్రణ వలన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగడం అన్యాయం. దేశ అభివృద్ధి కోసం జనాభా నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు పాటించాయి. ఉత్తరాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విఫలం కావడంతో వారికి డీలిమిటేషన్లో లబ్ధి జరగడం కరెక్టేనా. స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలకు 2047 నాటికి సూపర్ పవర్ కావాలి అంటే అభివృద్ధి సాధించిన రాష్ట్రాలకు ప్రోత్సహించాలి. కానీ శిక్షించకూడదు. ఈరోజు మనం డీలిమిటేషన్‌పై వ్యతిరేకించకపోతే చరిత్ర మనల్ని క్షమించదు, భవిష్యత్ భవిష్యత్తు తరాలు ఈరోజు మన మౌనాన్ని తప్పకుండా ప్రశ్నిస్తాయని కేటీఆర్ అన్నారు.

# తెలంగాణ పై కుట్రలు.. కేసీఆర్ షాకింగ్ కామెంట్స్



**జనం వెలుగు, హైదరాబాద్:–** తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో అధికారం బీఆర్ఎస్‌దేనని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సింగిల్‌గా అధికారంలో వస్తామని ఉద్ఘాటించారు. బెల్లం ఉన్న దగ్గర ఈగలు వస్తాయని అలానే సిరిసంపదలు ఉన్న తెలంగాణను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. గోదావరి కన్నీటి గోస పేరిట గోదావరిఖని నుంచి బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మహా పాదయాత్ర చేపట్టారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కోరుకంటి చందర్ మహా పాదయాత్ర ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్ కు చేరుకున్నారు. పాదయాత్ర చేసి వచ్చిన వారితో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ కీలక కామెంట్స్ చేశారు. పదేళ్ల తమ హయాంలో తెలంగాణలో ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు. ఇప్పుడు సమస్యల వలయంలో తెలంగాణ చిక్కుకుందని చెప్పారు. ఆనాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మెడపై కత్తి పెట్టిన తెలంగాణ కోసం తాను ఎక్కడ వెనకడుగు వేయలేదని గుర్తుచేశారు. తెలంగాణ కోసం ఎప్పటికైనా పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని కేసీఆర్ తెలిపారు. తెలంగాణకు ఆనాడు దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ మోసం చేసిందని కేసీఆర్ విమర్శించారు. ఏపీలో కూటమి లేకుంటే సీఎం చంద్రబాబు గెలిచేవారు కాదని చెప్పారు. బలవంతంగా తెలంగాణను ఆంధ్రాలో కలిపారని మండిపడ్డారు. ఈ నేలపై ఎవరూ శాశ్వతం కాదని చెప్పారు. అందరూ ఒక్కో కేసీఆర్‌లా తయారు కావాలని ఉద్ఘాటించారు. తెలంగాణ హక్కుల కోసం బీఆర్ఎస్ నేతలు పోరాడాలని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నోటికి వచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని.. కానీ ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చడం లేదని ధ్వజమెత్తారు. మేనిఫెస్టోలో పెట్టకపోయిన రైతుబంధు, కల్యాణ లక్ష్మీ పథకాలను ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని కేసీఆర్ ఉద్ఘాటించారు.

# జూలైలో స్థానిక ఎన్నికలు



**జనం వెలుగు, హైదరాబాద్:–** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ తేదీలపై మరోసారి ప్రచారం మొదలైంది ఇన్నాళ్లు బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణను పూర్తి చేయాలనే లక్ష్యంతో స్థానిక సంస్థల ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ రెండింటికీ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. అసెంబ్లీలో బీసీ, ఎస్సీ వర్గీకరణ బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఒకటి రెండు రోజుల్లో గవర్నర్సంతకం చేశాక గెజిట్ విడుదల కానుంది. రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ఇప్పటికే ముగిసింది. దీంతో ఒక్కొక్క దానికి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. రాష్ట్రంలోని ఏ స్థానిక సంస్థలకూ పాలకవర్గాలు లేవు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలో జీహెచ్ఎంసీకి సైతం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆ సమయం వరకు అన్ని స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే జూలైలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. మొదటి జెడ్పీటీసీ, ఎంపీటీసీ. ఆ తరువాత సర్పంచ్, అనంతరం మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇలా వరుసగా మూడు రకాల ఎన్నికలు జరగనున్నాయి.

### ప్రధాని మోడీకి వినతిపత్రం

బీసీ బిల్లుపై ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలిసి వినతిపత్రం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని కోరనున్నారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి అసెంబ్లీలో తీర్మానం చేసినందున, ఆయాపార్టీల ప్రతినిధులు వినతి మేరకు బీసీ బిల్లులకు ఆమోదం వస్తుందనే అంచనాలో కాంగ్రెస్ అధినాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావడానికి మరికొంత సమయం పడుతుందని, అప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల జోలికి వెళ్లవద్దని, కేంద్రానికి 2, 3 నెలల సమయం ఇచ్చాక.. అప్పటికీ కేంద్రం షెడ్యూల్–9లో చేర్చకుంటే తదుపరి కార్యాచరణపై ఆలోచించాలని ప్రభుత్వ పెద్దలుత చూస్తున్నారు.

### ముగిసిన పాలకవర్గాలు:

గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేక ఏడాది కావొస్తోంది. ఇక జెడ్పీ, మండల పరిషత్‌లకు 8 నెలలు కావొస్తుంది. మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగిసి రెండు నెలలు అయ్యింది. వీటితో పాటు సహకార సంఘాల పదవీకాలాన్ని 6 నెలల పాటు పొడగించారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

### బీసీ గణనతో మార్చిలో ఎన్నికలు మిస్.

అనుకున్న షెడ్యూల్ ప్రకారం మార్చిలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణకు అన్నిరకాల ఏర్పాట్లు జరిగాయి.కానీ, చివరి నిమిషంలో బీసీ గణనకు మరో సారి గడువు ఇవ్వడం, దానికి చట్టబద్ధత కల్పించడం కోసం ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఇప్పుడు బీసీ బిల్లుపై కేంద్రం స్పష్టత, మరోవైపు వేసవిలో తాగు, సాగునీరు, విద్యుత్ సమస్యలు సహజంగానే ఉండే అవకాశం ఉన్నది. అందుకే జూన్మధ్య నుంచి ఎన్నికల రిజర్వేషన్అధికారిక ప్రక్రియను ప్రారంభించడంతో జులైలో ఎన్నికలు జరుగుతాయని పార్టీ నాయకులు చెబుతున్నారు. అప్పటికల్లా వర్షాలు కురుస్తాయని, విద్యుత్, సాగు, తాగు నీటి సమస్యలు తీరుతాయని పార్టీనాయకులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా అధికార పార్టీకి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఇలా చేయడం వలన పార్టీకి సానుకూల ఫలితాలు వస్తాయని విశ్లేషిస్తున్నారు.

### నిధుల రావాలంటే ఎన్నికలు జరగాల్సిందే,

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదలను నిలిపేసింది. మరోవైపు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలంటే పాలకవర్గం ఆమోదం తప్పనిసరి. అత్యవసరమైన పనులు మినహా మిగిలిన పనులు చేయడానికి అవకాశం లేదు. ఇక కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఏడాదిగా నిలిచిపోయాయి. దీంతో స్థానిక సంస్థలు నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. ప్రత్యేక అధికారులు 2 రకాల విధులు నిర్వహించడం కష్టంగా మారిందని టాక్. అదే సమయంలో రాజకీయంగా పార్టీ కోసం కష్టపడ్డ నాయకులకు గుర్తింపు ఇవ్వడానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి వారికి అవకాశం కల్పించాలని అధికార పార్టీ చూస్తుంది. ఏ రిజర్వేషన్ కింద ఎవరిని బరిలో నిలబెట్టాలనే దానిపై ఇప్పటికే క్లారిటీ వచ్చినట్లు తెలిసింది. దీంతో ఎన్నికల బరిలో నిలవడానికి అధికార పార్టీ పూర్తిస్థాయి సన్నద్ధతో ఉన్నట్లు తెలుస్తోంది.

# త్వరలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల (జీపీఓ) నియామకం

**జనం వెలుగు, హైదరాబాద్, మార్చి 22:–** తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ శాఖకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో వీఆర్వో, VRA వ్యవస్థను పునరుద్ధించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా రెవెన్యూ గ్రామానికి అధికారిని నియమించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖలో కొత్తగా గ్రామ పాలన అధికారుల (GPO) పోస్టులు మంజూరు చేశారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో 10,954 గ్రామ రెవెన్యూ అధికారుల పోస్టులు ఏర్పడ్డాయి. మాజీ వీఆర్వోలు, మాజీ వీఆర్ఏల నుంచి మొదట ఆప్షన్స్ తీసుకుని, తరువాత నియామకాలు చేపట్టనున్నట్లు ఆర్థిక శాఖ తాజా ఉత్తర్వులలో పేర్కొంది. గత ఏడాది డిసెంబర్ 28 వరకు వీఆర్వోలు, వీఆర్ఏల పునరుద్ధరణకు సంబంధించి ప్రక్రియ పూర్తి చేయాలని తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.తెలంగాణలో మొత్తం 10,954 వరకు రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న వీఆర్ఏ, వీఆర్వోలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఇతర శాఖల్లోకి బదిలీ చేసింది. ధరణి పోర్టల్ వచ్చాక, వారిని రెవెన్యూ శాఖ నుంచి ఇతర శాఖలకు బదిలీ చేశారు. అయితే మాజీ వీఆర్వో, వీఆర్ఏలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

### భూ భారతి చట్టంతో అమల్లోకి కొత్త విధానాలు

తెలంగాణ ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల్లో ధరణి రిజిస్ట్రేషన్ ని రద్దు చేస్తూ భూ భారతి చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టంలో భాగంగా వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను జీపీవో (గ్రామ పాలనా అధికారులు)గా తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ హయాంలో రెవెన్యూ శాఖలో సంస్కరణల పేరిట వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి భూములకు సంబంధించిన అనుమతులు ఇచ్చి రిజిస్ట్రేషన్లు కొనసాగించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాత విధానాన్ని మళ్లీ తీసుకొస్తుంది. వీఆర్వో, వీఆర్ఏ స్థానంలో గ్రామ పాలన అధికారులను నియమించేందుకు పది వేలకు పైగా పోస్టులు మంజూరు చేసింది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి త్వరలోనే ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది.

# కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించని కాంగ్రెసు

### మాజి మంత్రి బాల్కొండ ఎంఎల్ఏ వేముల ప్రశాంత్ రెడ్డి

**జనం వెలుగు ఆర్మూర్:–** రాష్ట్రంలో ఆర్&బి, పంచాయతి రాజ్ శాఖ లలో చేసిన వివిధ పనులకు కాంగ్రెసు పార్టీ బిల్లులను చెల్లించడం లేదని పనులను ఎలా చేయాలని కాంట్రాక్టర్లులబో దిబో మంటున్నారని మాజి మంత్రి బాల్కొండ ఎంఎల్ఏ వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించాడు. 17 వేల కి.మీ 28 వేల కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పెట్టుబడులతో రోడ్ల నిర్మాణం చేపడతామని రాష్ట్ర కోమటి రెడ్డి అన్నాడని ఆయన తెలిపాడు. 17 వేల కి.మీ.ఒక్క ఆర్&బిలో నేనా లేక పంచాయతి రాజ్ రోడ్లు ఉంటాయా అని మంత్రి కోమటిరెడ్డి సమాధానం చెప్పాలని ఆయన అన్నాడు. 50 ఏండ్లలో 6093 కి.మీ.డబుల్ లైన్ రోడ్లు ఉంటే, 10 సంవత్సరాల మా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 8672 కి.మీ.(నేషనల్ హైవే ట్రాన్స్ఫర్ చేసినవి కలిపి)డబుల్ లైన్ పను లను చేశామని ఆయన తెలిపాడు. అంతేగాక 50 ఏండ్లలో 669 కి.మీ. 4 లైన్ల రహదారి(రోడ్డు)ఉంటే, బిఆర్ఎస్ హయాంలో 10 ఏండ్లలో కొత్తగా 4 లైన్ల రోడ్లను 485 కి.మీ వేశా మని ఆయన తెలిపాడు. కొత్తగా కాంగ్రెసు పార్టీ పెట్టుకున్న లక్ష్యం 17 వేల కి.మీ.28 వేల కోట్లలో, 40 శాతం రాష్ట్ర ప్రభు త్వం,60 శాతం ప్రైవేటు పెట్టుబడులతో పనులను కొనసాగిస్తామని మంత్రి కోమటిరెడ్డి అంటున్నాడని ఆయన అన్నాడు. 60 శాతం ప్రైవేటు పెట్టుబడి అం టే సుమారు 16800 కోట్లు, ప్రైవేటు పెట్టుబడులు అంటే కాంట్రాక్టర్లా లేక బ్యాంకులు పెట్టు బడులు చేస్తాయా ప్రజలకు మంత్రి కోమటిరెడ్డి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశాడు. బిఆర్ఎస్ హయాంలో ఆర్&బి శాఖ ద్వారా రోడ్లు మరియు బ్రిడ్జిల కోసం సుమారు 20 వేల కోట్ల రూపాయలను అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం వ్యయం చేసిందని ఆయన తెలిపాడు. 28 వేల కోట్లలో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం అంటే 11200 కోట్లు అవు తుందని, ప్రైవేటు పెట్టుబడిదారు లకు 60 శాతం అంటే 16800 కోట్లు అవుతుందని ఈ పనులన్నీ ఎన్ని సంవత్సరాలలో పూర్తి చేస్తారో మంత్రి కోమటిరెడ్డి తేల్చాలని ఆయన అన్నాడు. మంత్రి కోమటిరెడ్డి నియోజక వర్గమైన నల్గొండలో సుమారు 200 కోట్లతో రోడ్లు



మరియు బ్రిడ్జిల పనులను చేశామని మంత్రి చెప్పడం సభను శాసన సభను తప్పు త్రోవ పట్టించాడన ఆయన అన్నాడు.

# ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**జనం వెలుగు, హైదరాబాద్, మార్చి 22 :–** రాష్ట్ర ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. మరో వారంరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆర్థిక శాఖలో స్థితిగతులపై చర్చించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై అధికారులతో రివ్యూ చేశారు. కేంద్రంలోని ఆయా శాఖల నుంచి రావాల్సిన నిధులు వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర పథకాలకు సంబంధించి అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించి...సకాలంలో నిధులు విడుదల అయ్యేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. కేంద్ర పథకాలకు సంబంధించి 5 శాఖల నిధులు రావాల్సి ఉందని అధికారులు తెలపగా కేంద్రంతో సంప్రదింపులు జరిపి ఆర్థిక సంవత్సరం ముగింపులోగా నిధులు తెచ్చుకోవాలని తెలిపారు. హైదరాబాద్ లోని సిఎం నివాసంలో జరిగిన ఈ రివ్యూకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ సెక్రటరీ రోనాల్డ్ రోస్ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, సిఎంవో అధికారులు పాల్గొన్నారు.